క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మణికొండ: పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్, సాయిగౌతమి కాలనీ, సాయి చంద్ర కాలనీ ప్రాంతాలలో విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. ల్యాంకోహిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సెక్రటేరియట్ కాలనీ ఫీడర్ పరిధిలోని ఆదిత్య విల్లా నుంచి అలకాపూర్ చింతచెట్టు సర్కిల్ వరకు మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంట వరకు, అలకాపూర్ ఫీడర్ పరిధిలోని క్యూ కాలనీ, సైలా అపార్ట్‌మెంట్స్, పెంటయ్యనగర్, కేఎస్ ఆర్ హిల్స్, డైమండ్‌హిల్స్, వినాయక్‌నగర్ ఫేజ్–2లలో మధ్యాహ్నం 2గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. పుప్పాలగూడ ఫీడర్‌లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మారుతినగర్, పుప్పాలగూడ గ్రామం, దుర్గానగర్, శివనగర్, రాఘవేంద్రకాలనీ, సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు కేపీఆర్ కాలనీ, మణికొండ గార్డెన్, సాయంత్రం 5గంటల నుంచి 6గంటల వరకు శివాజీనగర్, పైప్ లైన్ రోడ్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మణికొండ: గండిపేట మండల పరిధిలో నూతనంగా వివాహం చేసుకున్న యువతులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం గండిపేటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అందజేయనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మండల పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ హయాంలోనే దేశాభివృద్ధి



మన్ కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజల కోసం అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటూ వారి అభివృద్ధికి పాటుపడుతున్నారని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. ప్రతి నెల చివరి ఆదివారం ఉదయం ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించే మనసులో మాట(మన్ కీ బాత్) కార్యక్రమం 99వ ఎపిసోడ్‌ను అత్తాపూర్ డివిజన్ మన్ కీ బాత్ ఇన్‌చార్జి సాయియాదవ్ ఆధ్వర్యంలో స్థానిక బీజేపీ కార్యాలయంలో వీక్షించారు. ఈ సందర్భంగా నారగూడెం మల్లారెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోదీ అవయవ దానంపై చేసిన ప్రసంగం దేశ ప్రజలందరినీ ఆకట్టుకుందన్నారు. సోలార్ విద్యుత్ ప్రయోజనాలను ప్రధాని వివరించారన్నారు. వచ్చే నెల ఏప్రిల్ చివరి ఆదివారం 100 ఎపిసోడ్ పూర్తి చేసుకోబోతున్న సందర్భంగా ప్రజలందరు వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాకుళారం సతీష్, వంశీ, నగేష్, అనూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ముగిసిన క్రికెట్ టోర్నీ



కప్‌ను అందిస్తున్న మాజీ సర్పంచ్ నర్సింహ

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో వారం రోజులుగా కొనసాగుతున్న కేపీఎల్ సీజన్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. సీహెచ్. నరేష్, మహ్మద్ వాహీద్, ఆర్ ప్రేమ్‌కుమార్‌ల స్మారకార్థం స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో 14 జట్లు పాల్గొనగా ఎస్ఆర్–11 జట్టు విన్నర్‌గా నిలిచి రూ.44.444 నగదు బహుమతితో పాటు కప్‌ను అందుకుంది. రన్నరప్‌గా నిలిచిన ఎల్‌జేటీ టీమ్–11 జట్టుకు రూ. 22, 222 నగదు, కప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఆర్. నర్సింహ మాట్లాడుతూ క్రీడలతో యువతకు శారీరక దారుఢ్యంతో పాటు మంచి స్నేహ సంబంధాలు ఏర్పడతాయన్నారు. యువత పెడదోవన పట్టకుండా ఇలాంటి క్రీడలను హాబీగా చేసుకుని పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జంక్షన్ జామ్..

రెండేళ్లుగా తరచూ ముంపునకు గురవుతున్న ఎగ్జిట్–15

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై నిర్లక్ష్యం
- పనులు ప్రారంభంకాకపోవడంపై స్థానికుల ఆందోళన
- వర్షాకాలంలో వాహనదారులకు తప్పని తిప్పలు



వరదనీటిలో పెద్దగోల్కొండ ఔటర్ జంక్షన్(ఫైల్)

శంషాబాద్ రూరల్: వర్షాకాలంలో తరచూ ముంపునకు గురవుతున్న ఔటర్ జంక్షన్ వద్ద ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నా. భారీ వర్షాలు కురిస్తే నెలల తరబడి వరదనీరు నిలిచిపోతోంది.. దీంతో పెద్దగోల్కొండ వద్ద ఔటర్ మార్గంలోని ఎగ్జిట్–15లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

రెండు నెలలు నిలిచిన రాకపోకలు..

గత ఏడాది కురిసిన వర్షాలకు జంక్షన్ వద్ద భారీగా వరదనీరు నిలిచిపోయింది. దీంతో దాదాపు రెండు నెలల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రింగు రోడ్డుకు ఉత్తరం వైపు చిన్నగోల్కొండ శివారులో ఉన్న నర్సింహ కుంట నిండిపోవడంతో నీరు వెళ్లేందుకు దారి లేక జంక్షన్ ముంపునకు గురైంది. కుంట నుంచి దిగువకు నీటిని వదిలేందుకు అధికారులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. స్వయంగా మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ ఘటన స్థలాన్ని సందర్శించినా పరిష్కారానికి చాలా సమయం పట్టింది. ఎట్టకేలకు నర్సింహ కుంట నుంచి నీటిని బయటికి వదిలేయడంతో జంక్షన్‌లో వరద ఖాళీ అయింది. తర్వాత కొన్ని రోజులకు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

వాహనదారుల అవస్థలు..

ఎగ్జిట్–15లో వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. గచ్చిబౌలి, శంషాబాద్, షాద్‌నగర్ వైపు నుంచి తుక్కుగూడ, మహేశ్వరం, కేశంపేట్ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు ఈ జంక్షన్ మీదుగానే వెళ్లాల్సి ఉంది.జంక్షన్ జాం కావడంతో వాహనాలను దారి మళ్లించారు. నర్సింహకుంట కట్ట మీదుగా బహదూర్‌గూడ నుంచి ఔటర్ సర్వీసు దారి గుండా వాహనాలు రాకపోకలు సాగించాయి. ఈ మార్గం ఇరుగ్గా ఉండడంతో పాటు భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

కబ్జాలతోనే కష్టాలు..

పెద్దగోల్కొండ శివారులోని ఔర్ రోటరీ జంక్షన్ సమీపంలోని చెరువులు, కుంటలు, వరదకాలువలు చాలా వరకు కబ్జాలకు గురయ్యాయి. దీంతో నీరు వెళ్లే మార్గం లేకపోవడం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి వరదనీరంతా ఔటర్ జంక్షన్‌లో నిలిచిపోతుంది. ఇక్కడి నుంచి బయటికి వెళ్లే మార్గం లేక నెలల తరబడి జంక్షన్ మునకలోనే ఉండాల్సి వస్తోంది. ఔటర్‌ను ఆనుకుని ఉన్న నర్సింహ కుంటలో కొందరు మట్టి పోయడంతోనే సమస్య నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఔటర్ నిర్మాణంలో అధికారులు అనాలోచిత చర్యలే సమస్యకు కారణమని మరికొందరు ఆరోపిస్తున్నారు.



టోల్ గేట్ వద్ద వరదనీరు(ఫైల్)

ఎత్తు పెంచితేనే..

ఔటర్ జంక్షన్‌లో రోడ్డు ఎత్తు పెంచితే ముంపు సమస్య తప్పుతుంది. అందుకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పి సుమారు 5 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. వర్షాకాలనికి మరో 3 నెలల సమయం ఉండగా.. ఆ లోపు పనులను పూర్తి చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది. లేని పక్షంలో ఎప్పటిలాగే భారీ వర్షాలు కురిస్తే సమస్య ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ పద్మావతి

బండ్లగూడ: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీ బి–బ్లాక్‌లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదేశాల మేరకు రూ. కోటితో డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. ఆదివారం మేయర్ మహేందర్‌గౌడ్, స్థానిక కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్‌తో కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాపయ్యయాదవ్, నదీమ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



ప్రేమావతిపేటలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజేంద్రనగర్: ఎస్సీ వర్గీకరణ బిల్లు వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని లేని పక్షంలో బీజేపీకి మనుగడ ఉండదని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టనందుకు నిరసనగా ప్రజల మధ్యకు వెళ్లి బీజేపీ చేస్తున్న మోసాలను ఎండగడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రేమావతిపేటలో విద్యార్థి నాయకులు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కులాల వర్గీకరణ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికి అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఎస్సీలను మోసం చేస్తూ కాలయాపన చేస్తున్నారని, ఇకపై తాము సహించేది లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కార్తీక్ మాదిగ, నరేష్‌మాదిగ, మీసాల గణేష్‌మాదిగ, శివమాదిగ, మద్దిలేటి మాదిగ, శంకర్‌రావు , ఎడ్లకాడి సూర్యం, ఉపేందర్, బర్ల సుమన్, ఎడ్లకాడి చంద్రశేఖర్, బైండ్ల నగేష్, మంగళారం రవి, గడ్డం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

రాజేంద్రనగర్: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాల, అభ్యర్థులకు పరిహారం ఇవ్వాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. లక్షలు అప్పు చేసి గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యేసమయానికి పేపర్ లీకేజీ వ్యవహారంతో నిరుద్యోగులు నీరుగారి పోయారన్నారు. వీరిని ఆదుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. లీకేజీకి పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లోని ఇంటి దొంగలే కారణమని స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థలపై విచారణ చేపట్టాలన్నారు. ఇందుకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, కమిటీ సభ్యులు, నైతిక బాధ్యత వహిస్తూ పదవుల నుంచి తప్పుకోవాలని లేని పక్షంలో ప్రభుత్వమే వీరిని తొలగించాలని డిమాండ్ చేశారు. రద్దయిన పరీక్షలను తిరిగి నిర్వహించే సందర్భంలో పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి భారం లేకుండా ప్రభుత్వమే అన్ని రకాల బాధ్యతలు తీసుకోవాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖానాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో గండిపేటలోని మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అన్ని రకాల వ్యాధులతో పాటు దంత సంబంధిత పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, వైద్యులు వి. హరిలీల, డాక్టర్ సునీత, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంద మంది పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ టి.అనితారెడ్డి అన్నారు. జడ్పీటీసీ నీరటి తన్వీరాజు ఆధ్వర్యంలో ఆదివారం పెద్దషాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ సేవలో మహిళలు చొరవ చూపడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువతుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నీలం, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, ఎంపీటీసీ సభ్యులు గౌతమి, సంగీత, సరిత, సర్పంచులు బుచ్చమ్మ, కల్పన, నర్సమ్మ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉద్యానవన విద్యార్థి



ఆసిఫుల్లాబేగ్

ఏజీవర్సిటీ: శ్రీకొండ లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం విద్యార్థి ఆసిఫుల్లా బేగ్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 27 నుంచి 31 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని బన్సార పట్టణంలో ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో 28 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆసిఫుల్లాబేగ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతడిని విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ చిన్ననాయక్ అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. క్రీడాకారులకు వర్సిటీ అన్ని విధాల అండగా ఉంటుందన్నారు.

కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గ సభ్యులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లోని భాగ్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అర్జున్‌కుమార్‌యాదవ్, బి.నారాయణరావు ఎన్నికల నిర్వహణ అధికారులుగా వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు పదవీ స్వీకరణ ప్రమాణం చేశారు. అధ్యక్షులుగా పీసీసీ చారి, ఉపాధ్యక్షులుగా కె.అంజద్‌భాష, ప్రధాన కార్యదర్శిగా వి.సురేందర్, సహాయ కార్యదర్శిగా పి.లక్ష్మారెడ్డి, కోశాధికారిగా ఎం.జగనయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.వినోద్‌కుమార్, కల్చరల్ సెక్రటరీగా ఎం.సాయికిరణ్ ఎన్నికయ్యారు. అనంతరం కాలనీ వాసుల సమక్షంలో అడ్వైజర్‌గా కటారే రామ్‌నరేష్, రామచంద్రయ్య, లీగల్ అడ్వైజర్‌గా ఐ.నాగేందర్‌రావులను నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చారి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా 16వ డివిజన్ నాయకులు టింకురెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తోడ్పడతామని హామీ ఇచ్చారు. కాలనీ వాసులంతా కలిసికట్టుగా సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'రాహుల్ గాంధీపై వేటు అనైతికం'



దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



బండ్లగూడ: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు అప్రజాస్వామికమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం గాంధీ భవన్ వద్ద నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్షకు మద్దతుగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ మోదీ నయా నియంతగా మారి ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడిచారన్నారు. తన మిత్రుల కోసం మోదీ దేశాన్ని కొల్లగొడుతున్నారన్నారు. ఫిబ్రవరి 7న రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ఆదానీ కుంభకోణంపై ప్రశ్నించారన్నారు. సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఆయనపై కుట్ర చేసి అనర్హత వేటు వేసిందన్నారు. అన్యాయాలపై ప్రశ్నించే గొంతుకలను అణచివేసే ధోరణిలో బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆశోక్‌యాదవ్, గడ్డం శేఖర్‌యాదవ్, నవీన్, నరేందర్, పాపిరెడ్డి, అంకం శ్రీనివాస్, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

ఆతిథ్య రంగంలో హైదరాబాద్ టాప్

- నోవాటెల్ జనరల్ మేనేజర్ సుఖ్‌వీర్‌సింగ్
- కొత్తగా బీ–జిన్ ప్రారంభం



మాట్లాడుతున్న నోవాటెల్ హోటల్ జనరల్ మేనేజర్ సుఖ్‌వీర్ సింగ్

శంషాబాద్: ఆతిథ్య రంగంలో హైదరాబాద్ నగరం అగ్రస్థానంలో ఉందని శంషాబాద్ ఎయిర్‌పోర్టు నోవాటెల్ హోటల్ జనరల్ మేనేజర్ సుఖ్‌వీర్‌సింగ్ అన్నారు. ఆదివారం హోటల్‌లో బీ–జిన్ పేరిట ఏర్పాటు చేసిన వేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పర్యాటకులు, వినియోగదారులను ఆకట్టుకునేలా హోటల్‌ను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పర్యాటకుల అభిరుచికి తగిన ఆహారపదార్థాలు, బ్రివరేజేస్ అందించేందుకు నోవాటెల్‌లో ప్రముఖ మిక్సాలజిస్టులను ఏర్పాటు చేసుకుంటుందన్నారు. బీ–జిన్‌లో ప్రముఖ మిక్సాలజిస్ట్ రోహన్ జెల్కీ తన ప్రత్యేకతను చాటుతున్నారన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న నాయకులు, అధికారులు

మణికొండ: మానవాళితో పాటు అన్ని జీవులకు నీరు ప్రాణాధారమని దానిని జాగ్రత్తగా వాడుకున్నపుడే భవిష్యత్తు తరాలకు ఉపయోగపడుతుందని మణికొండ డివిజన్ జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీలో ఆదివారం జలమండలితో కలిసి సొసైటీ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్, పేదరికం తొలగింపు ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో నీటి పొదుపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో ఇప్పటికే అనేక దేశాలు తాగునీటికి ఇబ్బంది పడుతూ ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయన్నారు. రాబోయే రోజుల్లో మనకు అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే నీటిని పొదుపు చేయటంతో పాటు ఇంకుడు గుంతలను ఎక్కువగా ఏర్పాటు చేసి భూమిలోకి నీటిని పంపాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంస్థ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాయి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్‌పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీరాములు, కౌన్సిలర్ వసంతరావు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మనోహర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అబాకస్ విజేతలకు బహుమతుల ప్రదానం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని హెరిటేజ్ ప్యాలెస్‌లో స్మార్ట్ కిడ్స్ లర్నింగ్ అకాడమీ కిస్మత్‌పూర్ ఆధ్వర్యంలో ఆదివారం అబాకస్ స్టేట్ లెవల్ 2023 చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఫౌండర్ వై.మల్లికార్జున్‌రావు, కాకతీయ ఆసుపత్రి సీఈవో డాక్టర్ హరిప్రకాష్ పోటీలను ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన 500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వివిధ కేటగిరిలో విజయం సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ట్రోఫీలను అందజేశారు.